కథానిక

# పనికిరాని సత్యనారాయణ

"అమరశ్రీ"

లక్ష్మీకుమారి ప్రొద్దున్నే లేచి మామూలుగా వంటిపని చూసుకున్నది. భర్త లేచే వేళ యింది. ఇంకా లేవలేదు. గదిలోకి పోయి చూసింది. భర్త లేడు. మంచంమీద ఏదో చీటి పడివున్నది. విప్పిచూసింది.

"నేను వెళ్ళిపోతున్నాను. సత్యనారాయణ."

అని వ్రాసివున్నది. భర్త ఇంట్లోంచి చెప్పకుండా వెళ్ళిపోయాడనగానే లక్ష్మీకుమారి మనస్సులోకి కొన్నిక్షణాలు ఏ ఆలోచన రాలేదు. మరుక్షణం ఒక తుఫాను

"మీవారేరి?" అని ప్రక్కింటావిడ అడిగితే తనేం సమాధానం చెప్పాలి. లక్ష్మీకుమారి కళ్ళలో నీళ్ళు గిర్రున తిరిగినయ్. "ఈ అమ్మాయి మొగుడు లేచిపోయాడు." అని తనను చూపించి లోకులు నవ్వుకుంటూంటే... లక్ష్మీకుమారి కళ్ళలో ఉన్న నీళ్ళు సన్నని బుగ్గల మీదుగా క్రిందికి ప్రవహించినయ్.

క్రిందటిరోజు సాయంకాలం తన భర్త కాలేజినుంచి రాగానే కాఫీఇస్తూ అడిగింది, తనకు ఒక గొలుసు చేయించమని. అసలు ఆ బుద్ధి తనకు పుట్టేదేగాదు. సూర్యకాంతం ఆ గొలుసు పెట్టుకొస్తే తన మనస్సు రెపరెపలాడింది. అడిగితే అడిగింది. అది సహజం. ఈసడింపుగా మాట్లాడింది. తన మెళ్ళోకి ఒక్క గొలుసుముక్కకూడ చేయించలేడని. పాపం ఆయనేమీ మాట్లాడలేదు. ఆయన బి.ఏ. చదివింది చదవటానికి. ఛీ, సాహిత్యపు అభిమానంతోనే లక్షణం పోలేదు. తన భర్త స్థితిగతులు తనకు తెలుసు. తనభర్త కాలేజీలో లెక్చరరేనని, జీతం రెండువందలరూపాయలకింకా తక్కువేనని, ఆ జీతంలో సంసారాన్ని పోషించటమే కష్టమనీ తనకు తెలుసు. తెలిసికూడ అడిగింది, పాపం! ఎంత కష్టపడ్డాడో మనస్సులో. చివరికి భార్యకూడ. అందులో చదువుకొని కొంత విజ్ఞానం సంపాదించిన భార్యకూడ ఇలా అడిగిందని బాధపడి పారిపోలేదు కదా! ఇంత బాధపడతాడనుకుంటే తనసలు అడిగేదే కాదు. ఇంతపని చేస్తాడని తను అనుకోలేదు. తనంటే ఎంత ఇష్టంగా ఉండేవాడు. ఎంత ప్రేమగా చూసేవాడు. అటువంటివాడు తనను తన పిల్లలను వదిలి వెళ్ళిపోయాడు. ఆయన ఎక్కడున్నాడో తెలిస్తే వెళ్ళి కాళ్ళమీద పడుతుంది. క్షమాపణ వేడుకొంటుంది. తన జీవితంలో ఎన్నడూ ఇకమీదట నగలు చేయించమని అడగదు. కాని ఆయనను కలుసుకోవటం ఎలా? మళ్ళా తను బతికుండగా ఇంటికి తిరిగి వస్తాడా?

లక్ష్మీకుమారి ఏడుస్తూ వంటింట్లో వంట చేస్తున్న అత్తగారి దగ్గరకు పోయింది. జరిగిన విషయం యేమని చెపుతుంది? చిట్టచివరకు అత్తగారే ఆమె చేతిలోని కాగితం తీసి చదువుకున్నది. కళ్ళవెంబడి నీళ్లు తిరిగినయ్. కోడలిని చేతులలో పట్టుకొని "వస్తాడులేమ్మా! యేడవకు. నలుగురూ వింటే అల్లరయిపోతుంది" అన్నది. లక్ష్మీకుమారి ఏడుపు మానేసింది. పరుగెత్తుకుంటూ వచ్చిన బాబును ఒళ్ళోకి తీసుకుంది.

కోడలికి ధైర్యం చెప్పిందేగాని తనకసలు ధైర్యంలేదు. ఏం చేస్తుంది తనుమాత్రం? తన కొడుకు ఇటువంటి పని చేస్తాడని తను కలలో కూడ అనుకోలేదు. జీవితంమీద ఇంత విరక్తి కలగవలసిన పనులేమి జరిగినయ్! జీతం చాలక పోయినంత మాత్రాన కుటుంబాన్ని పోషించలేనంత మాత్రాన ఇంట్లోనుంచి పారిపోవాలా? ఇంతకంటె తక్కువ జీతంలో, ఇంతకంటె పెద్ద కుటుంబాలను యెంతమంది సాకటంలేదు? నిన్న మధ్యాహ్నం తను ఇదే ప్రశ్న వేసింది కొడుకుని? రెండో తారీఖుగదా

అని డబ్బు అడిగింది, చిల్లర బాకీలు తీర్చివేదామనే ఉద్దేశ్యంతో. కాని లేదు, అంతా ఖర్చు అయిపోయిందన్నాడు. స్వంత ఖర్చు నిగ్గించు కోమని కఠినంగా చెప్తూ, రెండు మూడు మాటలన్నది. అంతమాత్రానికే కోపం కలగాలా? తను ఇదివరకెన్నిసార్లు తిట్టలేదు. కాని నిన్న మధ్యాహ్నం ఏదో చిరాకుగా ఉన్నాడు. తను గ్రహించుకోకుండా దురుసుగా మాట్లాడింది. తను ఆ విధంగా మాట్లాడకుండా ఉన్నట్లయితే పోయేవాడు కాదేమో! తను ఎందుకు మాట్లాడింది అంత కఠినంగా? ఇప్పుడు పశ్చాత్తాప పడినందువలన ఏం లాభం?

"సత్యనారాయణా!" అని బయటనుంచి కేక వినిపించింది. ఆమె బయట గది వైపు నడిచింది. పుస్తకాలతో సహా యథాప్రకారం వెంకట్రావు ప్రత్యక్షమయ్యాడు. అప్పుడిన్నా దుఃఖం ఆగింది కాదు ఆమెకు.

వెంకట్రావుకు అర్థం కాలేదు పరిస్థితి. "ఏమయింది? ఏమిటిది?" అన్నాడు.

"లోపలికి రండి" అన్నదామె

వెంకట్రావు లోపలకు పోయాడు. వెనుక గుమ్మందగ్గర నిలబడ్డ లక్ష్మీకుమారి వెంకట్రావుని చూడగానే, పెద్దపెట్టున చంటిపిల్లలా ఏడ్చింది. సత్యనారాయణ వ్రాసిపెట్టిన కాగితం చూశాడు వెంకట్రావు.

"ఏడవకండి మీరు, నేను వెళ్ళి వాడిని కలుసుకొని తీసుకొస్తాను." అన్నాడు వెంకట్రావు వాళ్ళనుద్దేశించి.

వెంకట్రావు పుస్తకాలు పట్టుకొని బయటకు వస్తుంటే, లక్ష్మీకుమారి, సత్యనారాయణ తల్లి ఆతని కళ్లలోకి ఆశగా చూశారు. వెంకట్రావు నిజంగా బాధపడ్డాడు, క్రితం రాత్రి జరిగిన సంఘటనకు.

సత్యనారాయణ యెంత మంచివాడు! ఒక్క విషయం పట్టించుకోడు. తన విషయం కూడా తనకి పట్టినట్లు కనుపించదు. నడుస్తూ వెంకట్రావు ఒక్కసారి ఆగిపోయాడు. తనకోసం ఏదైనా చేస్తాడు. ప్రాణం యివ్వమన్నా యిస్తాడు. రాత్రి డబ్బు అర్జంటుగా తనకు కావలసివస్తే యిచ్చాడు అరవై రూపాయలు. కావలసినప్పుడు ఏ స్నేహితుడిస్తాడు? తిరిగి యిమ్మని కూడా అడగడు మానవుడు. అసలు అతనిలో ఉన్న పెద్దలోపమే అది. తను ఇప్పటికి సత్యనారాయణకు రెండువందల రూపాయలివ్వాలి. సత్యనారాయణ అడగనివాడు గాబట్టి తను ఇంత అలస్యం చేసాడు. ఆర్థిక పరిస్థితి వలన ఇంట్లోనుంచి పారిపోలేదు కదా! పరిస్థితులు తెలిసికూడా, రాత్రి డబ్బు అడగటం తనదే తప్పు. కొంపతీసి ఆతను లేచిపోవటానికి సన్నిహిత కారణం రాత్రి తాను అప్పు తీసుకోవటం కాదుగదా! ఏమో? సత్యనారాయణ ఒక నిండుకుండ, తొణకడు.

ఆగిపోయిన వెంకట్రావు కదిలి, కాలేజి వైపు నడిచాడు. సాయంత్రం క్లబ్బుకి పోయాడు వెంకట్రావ్. ఈ రోజు వెంకట్రావ్‌ను ఒంటరిగా చూసి అందరూ ఆశ్చర్యపోయారు. సత్యనారాయణ రాలేదేమని అడిగినవాళ్ళు లేకపోలేదు. సత్యనారాయణ వచ్చి మామూలుగానే కాఫీ ఆర్డరు చేయవోయ్ అనేవాళ్లు 'ఫ్రెండ్స్'. సత్యనారాయణ చెప్పేవాడు, "ఫ్రెండ్స్" సిద్ధపడేవారు. సత్యనారాయణ బలవంతంచేసి వాళ్ళచేత కాఫీ



ప్రారంభించి, ఖర్చు తన పేర వ్రాయించుకొనే వాడు. వెంకట్రావు తనకు తెలిసిన విషయాన్ని చెప్పాడు. వాళ్ళందరకూ వెంటనే బుర్రలో ఒక విషయం మెరిసింది. రోజూ ఇంత మందికి కాఫీ ఇప్పించలేక, ఇప్పించ ననలేక ఇరుకున పడి, తప్పించుకొని పారిపోయాడేమో? సత్యనారాయణ పారిపోవటానికి ఇదే కారణం అని అనుకున్నవాళ్లు వాళ్ళలో లేకపోలేదు.

కిళ్లీ కొట్టుకుపోయి సిగరెట్ తీసుకొంటుంటే, కొట్టువాడడిగాడు సత్యనారాయణ ఏమైనాడని. నాకంతా తెలుసులెమ్మన్నాడు కొట్టువాడు. సత్యనారాయణ బాకీ ఎంతని అడిగితే ఈ నెల అరవై రూపాయలు, పోయిన నెలలో ఇవ్వవలసింది ఇరవై రూపాయలు మొత్తం ఎనభై రూపాయలు ఇవ్వాలన్నాడు. అంటూనే తన బాకీ ఇవ్వలేకనే ఇంట్లోనుంచి పారిపోయాడన్నట్లు అనుమానంగా చూశాడు. బాకీదార్లందరూ ఇలానే అనుకొంటారనుకున్నాడు వెంకట్రావు. పాపం! వాళ్ళకేం తెలుసు? తనలాంటి వెంకట్రావులు చాలామంది సత్యనారాయణకు బాకీలున్నారని.

సరాసరి సత్యనారాయణ ఇంటివేపు నడిచాడు. వరండాలో సత్యనారాయణ కొడుకు, బాబు దిగాలుపడి కూర్చొని ఉన్నాడు. వెంకట్రావుని చూడగానే "నాన్నగారు లేరు" అన్నాడు.

"ఎక్కడకు పోయాడు?"

"చెప్పకుండా పోయారుట, ఇంట్లోనుంచి"

"లేరు లే." అన్నాడు వెంకట్రావు.

"రాత్రి నాన్నగారిని కొట్టాను నేను, పంచదార బిళ్ళలు తీసుకురాలేదని. నాన్నగారు ఏడ్చారు. పొద్దున్నే వెళ్ళిపోయారు" అన్నాడు బాబు.

లక్ష్మీకుమారి వెనకనుంచివచ్చి బాబు నోరు మూసి ఇంట్లోకి ఎత్తుకుపోయింది. వెంకట్రావుకి ఇంట్లో అడుగుపెట్టటానికి ముఖం చెల్లక అడుగులో అడుగు వేసుకొంటూ చీకట్లోకి వెళ్ళిపోయాడు.

వారంరోజుల తరువాత ఒకనాడు ప్రొద్దున సత్యనారాయణ మాసిన బట్టలతో ఇంటివేపు వస్తున్నాడు.

వాకిలి తుడుస్తున్న లక్ష్మీకుమారి అమాంతం పోయి సత్యనారాయణ కాళ్ళమీదపడి క్షమాపణ వేడుకోలేదు.

సరాసరి లోపలకుపోయాడు. సత్యనారాయణ తల్లి అతనిని కావలించుకొని ఏడ్చి, బుజ్జగించలేదు. ఎందుకు పారిపోయావన్నట్లు చూసింది. నోట్లోనుంచి మాట రానేలేదు.

పదిగంటలకు కాలేజీలో వెంకట్రావు కనుపించాడు. రెండువందల అరవై రూపాయలు జేబులోనుంచి తీసి ఇవ్వలేదు.

మధ్యాహ్నం క్లబ్బులో అందరికీ కలిపి సత్యనారాయణ కాఫీ ఆర్డరు చేస్తుంటే, ఎవ్వరూ అడ్డుపడలేదు.

సాయంకాలం కిళ్లీ షాపువాడు సత్యనారాయణకు అప్పు ఇవ్వననలేదు, ఇవ్వవలసిన డబ్బు అడగనూలేదు, నోరు తెరిచి, ముఖంలోకి చూశాడు, అంతవరకే.

రాత్రి పండుకున్న తరువాత బాబు పంచదార బిళ్ళలు తేలేదని అడిగి, అలిగి ఒక ప్రక్కకు ఒదిగి పడుకున్నాడు.

మర్నాడు తొమ్మిదయినా లేవకపోయేసరికి లక్ష్మీకుమారిపోయి చూసింది మళ్ళా పారిపోయాడేమోనని. ఈసారి పారిపోలేదు. ప్రశాంతంగా పడుకొని ఉన్నాడు, మళ్ళా లేచే అవసరం లేకుండా.

జీవితగమనంలో మనం ఒక గుమ్మంనుంచి గెంటివేయబడి మనపై తలుపులు మూసివేయబడ్డప్పుడు, వెనువెంటనే విధి యింకో క్రొత్త తలుపులు మనకు తెరవబడి స్వాగతం ఇస్తుంది. మూసివేయబడ్డ తలుపులవేపే మనం దీనంగా విషాదంగా చూస్తూ కూర్చుంటాం; మనకోసమే తెరిచి సిద్ధంగా ఉన్న తలుపులను చూసుకోలేక పోతాం.—క్రిస్టియన్ సైన్స్ మానిటర్